ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 13 అక్టోబరు 2025

రండి బాబూ..రండి..

- మద్యం టెండర్ల దరఖాస్తుకు సమీపిస్తున్న గడువు
- 16వేల మందికి మెసేజీలు, బ్యానర్లతో ఎక్సైజ్ శాఖ ప్రచారం
- 'స్థానిక' ఎన్నికల వాయిదాతో మద్యం వ్యాపారుల్లో ఆసక్తి



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి రెండేళ్ల క్రితం చూపిన ఆసక్తి ప్రస్తుత టెండర్ల ప్రక్రియలో కనిపించడం లేదు. దరఖాస్తు ఫీజు పెరిగిన నేపథ్యంలో టెండరు వేసి నష్టపోతామనే భయంలో వ్యాపారులు ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మద్యం వ్యాపారులకు కలిసొచ్చే ఎన్నికలు లేకపోవడంతో టెండర్లు అరకొరగానే వస్తున్నాయి. దీంతో రండి బాబూ.. రండి.. మద్యం దుకాణాలకు టెండర్లు వేయండి.. అనే పద్ధతిలో ఎక్సైజ్ అధికారులే ప్రచారం మొదలుపెట్టారు. మద్యం వ్యాపారులను ఫోన్లలో పలకరిస్తూ ఆహ్వానాలు పలుకుతున్నారు. గతంలో మద్యం దుకాణాలకు టెండర్లు వేసిన వారికి దాదాపు 16వేల మెసేజ్‌లు వెళ్లాయి. దీంతోపాటు కరపత్రాలు, బ్యానర్లద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం స్థానిక ఎన్నికలు వాయిదా పడడంతో మద్యం వ్యాపారులు టెండర్ల వైపు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. హైకోర్టు బీసీ రిజర్వేషన్లపై స్టే ఇవ్వడంతో ఎన్నికలు ప్రక్రియ నిలిచిపోయింది. డిసెంబర్లో స్థానికసంస్థల ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తుండడంతో మద్యం దుకాణాలు దక్కించుకుంటే లాభదాయకంగా ఉంటుందని వ్యాపా రులు ఆలోచనలు చేస్తూ సిండికేట్‌గా ముందుకెళ్లే విధంగా వ్యూహా త్మకంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమైన వారు మద్యం టెండర్లు, ఎన్నికల ఖర్చు దృష్టిలో పెట్టుకొని మద్యం టెండర్లకు దూరంగా ఉన్నవారు తిరిగి టెండర్లలో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఆసక్తి చెబుతున్నారు.

● మిగిలింది ఐదు రోజులే..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 48మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమై 16రోజులు గడిచిపోయింది. ఇప్పటివరకు వ్యాపారం బాగా ఉండే దుకాణాలకు మాత్రమే టెండర్లు వేశారు. టెండర్ల గడువు ఈనెల 18తేదీతో ముగిసిపోతుంది. 23న డ్రా పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరుగుతుంది. ఇందుకు కేవలం ఐదురోజులే గడువు మిగిలి ఉండడంతో సోమవారం నుంచి గణనీయంగా దరఖాస్తులు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ఏర్పాట్లకు సైతం సిద్ధమైంది.

● అప్లికేషన్ ఫీజు రూపంలో రూ.5.55కోట్ల ఆదాయం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో టెండర్ల ప్రక్రియలో 48 దుకాణాల్లో 28 దుకాణాలకు మాత్రమే 185 టెండర్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖకు జిల్లా నుంచి అప్లికేషన్ ఫీజు ద్వారా రూ5.55కోట్ల ఆదాయం సమ కూరింది. గత లైసెన్స్ పీరియడ్‌లో 48 దుకాణాలకు డ్రా పద్ధతిలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. 2023-25 కాలానికి సంబం ధించి మద్యం వ్యాపారులు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. 2023 ఆగస్టులో జరిగిన టెండర్లలో 2036మంది దరఖాస్తులు చేసుకోగా, 150మంది మహిళలు ఉన్నారు. దరఖాస్తు రుసుము రూ.2లక్షలు ఉండడంతో ఎక్సైజ్ ఖజానాకు జిల్లా నుంచి 40.72 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తు ఫీజు పెరిగింది. గతంలో రూ.రెండు లక్షలు ఉండగా, ఈసారి మూడు లక్షలకు పెంచారు. జిల్లాలో ఇప్పటివరకు మద్యం అమ్మకాల ద్వారా ఎక్సైజ్‌శాఖకు భారీ రాబడి ఉంది. 1 డిసెంబరు 2023 నుంచి 10అక్టోబరు 20225 వరకు జిల్లాలో వచ్చిన..

- మిగతా 8లో

జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో జీపీ కార్మికులు, నాయకుల ధర్నా



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, జీపీ కార్మికులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన కార్మికులు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న రమేష్ అనే కార్మికుడు చెరువులో ఉన్న బావిలో నీటిపంపునకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులోనే పడి చనిపోవడాన్ని నిరసిస్తూ గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లేక్కలేనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. గంభీరావుపేట చెరువులోని బావి దగ్గరకు వెళ్లడానికి వీలులేకుండా కూడా ఉండడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసి కూడా రమేష్‌ను అధికారులు బలవంతంగా ఆ బావిలో పని చేయాలని పంపించడంతోనే రమేష్ చనిపోయాడని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు భద్రతను కల్పించి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, కనీస వేతనాలు అమలుచేయాలన్నారు. చనిపోయిన రమేష్ కుటుంబానికి రూ 10లక్షల ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు వర్కోలు మల్లయ్య, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు బూర శ్రీనివాస్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు అంజనేయులు, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు మహేష్, చీర్లవంచ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తుల నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

- ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంపర్క ప్రముఖ్ కుమ్మరికుంట సుధాకర్ - సిరిసిల్లలో పథ సంచలన్ ర్యాలీ



సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న విభాగ్ సంపర్క ప్రముఖ్ సుధాకర్

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉత్తమ వ్యక్తుల నిర్మాణమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లక్ష్యమని, సమస్యల పరిష్కరించడమే పనిగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంపర్క ప్రముఖ్ కుమ్మరికుంట సుధాకర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ నగర విభాగ్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయంసేవక్ పథసంచలన్ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ నిత్యశాఖల ద్వారా వ్యక్తుల నిర్మాణం చేసి వారిని అసలైన దేశభక్తులుగా తయారు చేసుందన్నారు. సమస్యల గుర్తించి వాటిని పరిష్కరిండమే పనిగా పని చేస్తుందన్నారు. భారత దేశం ప్రపంచంలోనే మూడవ ఆర్థిక శక్తిగా ఎదగడం ఇష్టంలేక ఆంక్షలు విధించే ప్రయత్నాలు సాగిస్తున్నాయన్నారు. స్వాభిమాన సమాజం స్వదేశీ వస్తువుల వినియోగంతో దేశంపై కుట్రలు పన్నే వారికి సమాధానాలు చెప్పాలన్నారు. కులాలు ఏర్పడ్డాయని కుల వృత్తులు అంతరించిపోతున్నాయని, ఏ కులం వారైనా ఏ వృత్తిలోనైనా రాణిస్తున్నారని ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని అందువల్ల కులాల పేరిట చీలిపోవడం మానేసి సమరసితను పాటించాలన్నారు. అందరం ఒకటే అనే భావన ప్రతిఒక్కరి పెంచాలన్నారు. ప్రతిగ్రామంలో ఒకటే గుడి, నీటి బావి, స్మశానం అనే విశాల దృక్పథం అందరికి ఉండాలని అప్పుడే దేశ ప్రజల మధ్య ఐక్యత మరింత పెరుగుతుందన్నారు. తమ అవసరాల కోసం కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారన్నారు. మొక్కలను నాటి చెట్లుగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సిరిసిల్ల నగర కార్యవాహ్ మడుపు శ్రీకాంత్‌రెడ్డి, చిలుకవేణు, కిరణ్‌కుమార్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి సురేశ్‌గౌడ్



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ముస్తాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : బీసీల ఐక్యత ద్వారానే అన్ని రంగాల్లో ముందుకు వెళతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఈడ్గురాళ్ల సురేశ్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జీకె ఫంక్షన్ హాల్‌లో సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా అలయ్ బలయ్ కార్యక్రమానికి విచ్చేసిన బీసీ నాయకులను శాలువతో సత్కరించి మెమొంటో అందించి సన్మానం చేశారు. బీసీలంతా ఐక్యతతో ఉద్యమిస్తేనే హక్కులు సాధిస్తామని లేదంటే మన భవిష్యత్ తరాలకు అన్యాయం చేసిన వారమవుతామని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీసీలంతా కలిసి ఐక్యతతో ఉద్యమించాలన్నారు. అగ్రవర్ణాల తాయిలాలలకు తలొగ్గవద్దని సూచించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఈబీసీ పేరుతో బీసీలకు వచ్చే ఉద్యోగాలను అగ్ర వర్ణాలకు కట్టబెట్టిందని... ఇలా అన్యాయం జరిగితే బీసీ వర్గాలు మరింత పేదరికంలో వెళ్లడం ఖాయమన్నారు. బీసీ వర్గాలు విద్యా, ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయ రంగాల్లో రాణిస్తేనే న్యాయం జరుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి బండారి దత్తాత్రేయ ఆధ్వర్యంలో మొదటిసారిగా హైదరాబాద్‌లో 2009లో ప్రారంభమైన అలయ్ బలయ్ ముస్తాబాద్‌లో కూడా మొదటిసారిగా జరుగడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, బీసీ టీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షులు కొండ యాదగిరిగౌడ్, మాజీ ఎంపీటీసీలు గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, బీసీటీపీలు బండారి మల్లేశం, విక్కుర్తి లక్ష్మీనారాయణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాకాల శ్రీకాంత్, సత్తయ్యగౌడ్, చెవుల మల్లేశం, తుమ్మ రాజేందర్, పెంజర్ల బాలెల్లం, కోల కృష్ణ, పులి రామ్‌గోపాల్, ప్రవీణ్ తాటికొండ కృష్ణహరి, వేముల సత్యనారాయణ, ప్రశంత్‌గౌడ్, కుంట శ్రీనివాస్ మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను సాధించుకోవాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు



కొత్తపల్లిలో మాట్లాడుతున్న పర్శ హన్మండ్లు

గంభీరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతో హక్కులను సాధించుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మండ్లు పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సమరంలో ముదిరాజ్‌లు తమ సత్తా చాటాలని పేర్కొన్నారు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు పెరమల్లె లింగయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పర్శ హన్మండ్లు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని అన్నారు. ముదిరాజులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు శివంది దేవేందర్, జిల్లా కార్యదర్శి పెరిమెల్లి రమేష్, గౌరవ అధ్యక్షుడు ఒరుగంటి నర్సింలు, మండల ఉపాధ్యక్షుడు ముచ్చ ఆనందం, మండల సంయుక్త కార్యదర్శి రంగు దేవయ్య, కోశాధికారి తోక దేవదాసు, సంఘ నాయకులు బాలరాజు, సంతోష్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ..

- రాజన్న సేవలో సీఎం ఓఎస్డీ శ్రీనివాస్..



సీఎం ఓఎస్డీకి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈవో

7

అప్పుడు అప్పగించారు.. ఇప్పుడు తప్పించారు..

- ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో మొండిచేయి..



ధాన్యం కొనుగోలు చేస్తున్న మహిళలు (ఫైల్)

8

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని యాథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ హరిత అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనిని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

క్రీడలతో పాటు విద్యలో రాణించాలి



వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్టు

బోయినపల్లి అక్టోబరు 12 (అంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలతోపాటు విద్యలో రాణించాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొదురుపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ వాలీబాల్ క్రీడా పోటీలను ఆదివారం ముగిశాయి. ఉమ్మడి జిల్లా వాలీబాల్ ఎస్‌జీఎఫ్ బాలుర విభాగంలో జగిత్యాల రాజన్న సిరిసిల్ల ప్రథమ, ద్వితీయ, బాలికల విభాగంలో రాజన్న సిరిసిల్ల ప్రథమ, జగిత్యాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు బహుమతులు అందించారు. ప్రతిభ చూపించిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

ఇల్లంతకుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై లక్‌పతి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం తిప్పాపూర్ గ్రామసమీపంలో శనివారం రాత్రి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న బొలెరో ట్రాలీ వాహనాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. తంగళ్ళపల్లి మండలం నేరెళ్ళ గ్రామానికి చెందిన చౌదరి వెంకటేశం అనే డ్రైవర్‌తో పాటు వాహన యజమాని కందుకూరి సాయికుమార్‌లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పోతుగల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 2000-2001 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి విద్యార్థి దశలోని మధుర స్మృతులను పంచుకున్నారు. గురువులను సన్మానించి మొమెంటో ప్రదానం చేశారు. దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా కలిసి ఒక్కచోట చేరడంతో చిన్నపిల్లలుగా మారి ఆనందాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, శివశంకర్, రాజిరెడ్డి పూర్వ విద్యార్థులు జంగ రాజు, మామిండ్ల శ్రీకాంత్, కొండం విష్ణు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలు దూరంగా ఉండాలి

చందుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చందుర్తి ఎస్సై రమేష్ అన్నారు.చందుర్తి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం వలన వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ అకౌంట్ నంబర్లు మోసగాళ్ల చేతిలోకి వెళ్లిపోతున్నాయని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్ లేదా యాప్‌ల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత మత్తుపదార్థాలు ఇవి వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని దెబ్బతీసేలా చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్

కోనరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని వేములవాడ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు న్యాత నవీన్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో వేములవాడ నియోజకవర్గస్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి సమస్యపై స్పందిస్తూ యువతను సమీకరించి పార్టీ ఆలోచనలను ప్రజల వద్దకు తీసుకపోవాలని కోరారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధి పనులను ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కోఆర్డినేటర్ నవీన్, అబ్బసాని దినేష్, వెంకటేష్, జలంధర్, శివకుమార్, అభిలాష్, అనిల్, దయాకర్, ఉదయ్, కిరణ్, వినయ్, శ్రీకాంత్, మధు, కార్తీక్, ప్రణీత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిపశువు మృతి

కోనరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో పాడి పశువు సోమవారం మృతిచెందింది. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన బుర్ర రవీందర్ అనే రైతుకు చెందిన పాడి ఆవు మేత కోసం వ్యవసాయ బావి గడ్డ మీదికి వెళ్లి మేతమేస్తుండగా పక్కనుంచి వెళ్లిన విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో పాడి రైతుకు 70 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

ప్రేమించి మోసం చేశాడని.. యువతి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్రేమించి మోసం చేశాడని యువతి అతని ఇంటి ముందు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లికి చెందిన యువతి హుజూరాబాద్‌కు చెందిన వినోద్ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇరువురు ప్రేమించుకున్నారు. ఇటీవల వినోద్ వేరే అమ్మాయిని వివాహం చేసుకుంటున్నాడని తెలుసుకున్న యువతి హుజూరాబాద్‌కు వచ్చింది. ఈ విషయంపై వినోద్‌ను నిలదీయగా, నాకు సంబంధం లేదంటూ వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన యువతివెంట తెచ్చుకున్న పురుగులమందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు


తీవ్ర గాయాలపాలైన మొండయ్య గౌడ్

ధర్మారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి జారి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన ఘటన కటికెనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనపురం మొండయ్యగౌడ్ కొన్ని సంవత్సరాలుగా గీతవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం కల్లు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్సనిమిత్తంకరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో ఆసుపత్రిసిబ్బంది మెరుగైనవైద్యంకోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. దీంతో కరీంనగర్‌లోని ఓప్రవేటు ఆసుపత్రిలోచేర్పి చికిత్సఅందిస్తున్నట్లు మొండయ్యకుమారుడు మహేష్ తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వీణవంక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడామంత్రిత్వ శాఖ మైభారత్ ఆధ్వర్యంలో బ్లాక్‌లెవల్ కబడ్డీ, వాలీబాల్ పోటీలను జిల్లా అధికారి వెంకటరాంబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో యువచైతన్య ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ సభ్యులు కర్రె నాని, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, తిరుపతి, సమ్మయ్య, సురేష్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- 1972లో నాగులపేట దగ్గర అరుదైన సైఫన్ నిర్మాణం
- ఇంజనీర్ రామకృష్ణం రాజు అద్భుత ప్రతిభ
- పై నుంచి వాగు నీరు.. కింది నుంచి శ్రీరాంసాగర్ నీరు
- పర్యాటక కేంద్రంపై అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీ

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు మోక్షమెప్పుడో?


సైఫన్ వద్ద బయటకు వస్తున్న నీరు

కోరుట్లరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం నాగులపేట వద్ద నిర్మించిన సైఫన్‌ను ఎప్పుడు పర్యాటక కేంద్రంగా మారుసారోనని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు. 1972లో ఈ సైఫన్‌ను రామకృష్ణంరాజు అనే ఇంజనీర్ డిజైన్ చేసి నిర్మించారు. రెండు సంవత్సరాల పాటు వెయ్యి మంది కూలీలతో రాత్రింబవళ్లు ఈ కట్టడాన్ని నిర్మించడంలో రామకృష్ణంరాజు ప్రధాన పాత్ర పోషించారు. పైనుంచి వాగు, కింది నుంచి కాకతీయ కాలువ సుమారు 200 మీటర్ల పొడవున నిర్మించారు. ఇలాంటి కట్టడం ఆసియాలోనే రెండోదిగా ప్రసిద్ధి గాంచింది. దీంతో పర్యాటకులు, విద్యార్థిని, విద్యార్థులు కాకతీయ కాలువ పారే సమయంలో సందర్శనకు వస్తుంటారు.


సైఫన్ వద్ద మాయమవుతున్న నీరు

• సైఫన్ వద్ద ఇంజనీర్ విగ్రహం


ఇంజనీర్ రామకృష్ణంరాజు విగ్రహం

అద్భుత కట్టడాన్ని నిర్మించిన రామకృష్ణం రాజు నిర్మాణ సమయం లోనే మరణించడంతో స్మృతికి చిహ్నంగా ఆయన విగ్రహాన్ని ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మాత్రం పర్యాటక కేంద్రంగా గుర్తించినప్పటికీ ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదు. కోరుట్ల పట్టణానికి ఏడు కిలో మీటర్ల దూరంలో నాగులపేట గ్రామం ఉంది. గ్రామ శివారులో కాకతీయ కాలువ మీది నుంచి వాగు ప్రవహిస్తుంది. గ్రామస్థుల సహకారంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సైఫన్ వద్ద పిక్నిక్‌కు వచ్చే వారి కోసం పార్కును ఏర్పాటు చేశారు. సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజకీయ నాయకులు ఇస్తున్న వాగ్దానాలు వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి సైఫన్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలి

-మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



కోరుట్ల మండల నాగులపేట గ్రామంలో కాకతీయ ప్రధాన కాలువపై నిర్మాణం చేసిన సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని నింపాలి.

ప్రభుత్వాలు చొరవ చూపాలి

-భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగులపేట



నాగులపేట గ్రామ శివారులో ఉన్న సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి. ప్రతి ఎన్నికలకు ముందు పోటీ చేసే ఎమ్మెల్యే, ఎంపీలు పర్యాటక కేంద్రంపై హామీ ఇచ్చి విస్మరిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రామగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో బాకం రాంమూర్తి ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల7న ఇంటి తాళం వేసి పెద్దపల్లికి వెళ్లారు. ఆదివారం తండ్రి రాజయ్య ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుతెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బీరువా పగులగొట్టి అందులో దాదాపు 4తులాల, బంగారం రూ.96 వేలు దొంగించినట్లుగా గుర్తించారు. ఈమేరకు రాంమూర్తి ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసుకొని పోలీసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

జమ్మికుంట రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు ఆదివారం బాధితులకు అందజేశారు. జమ్మికుంటకు చెందిన ముక్క వేణు, వావిలాలకు చెందిన తూర్పాటి వెంకటేష్, మోత్కులగూడెంకు చెందిన దుర్గం తిరుమల సెల్‌ఫోన్లు వివిధప్రాంతాల్లో చోరీకి గురయ్యాయి. ఐఎమ్ఈఐ నంబర్ ఆధారంగా దొంగలను పట్టుకొని, వారినుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు పట్టణసీఐ ఎస్ తెలిపారు.

నుస్తులాపూర్‌లో డ్రంకెన్‌డ్రైవ్

తిమ్మాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్‌లో ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దొరికినట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ముగ్గురికి గాయాలు


గాయపడ్డ ప్రయాణికులు


బోల్తా పడిన ఆటో

తిమ్మాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళుతున్న ఆటోను వెనుకల నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి అందులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తిమ్మాపూర్ మండలకేంద్రంలో ఆర్టీఏ కార్యాలయ సమీపంలో రాజీవ్‌రహదారిపై ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వైపు నుంచి రామకృష్ణాకాలనీవైపు వెలుతున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో రోడ్డుపై నుంచి కిందికి దూసుకుపోయి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజు, లక్ష్మి, మరొకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

వాగు ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

- రక్షించిన స్థానిక యువకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్యఉన్న మానేరువాగు లో-లెవల్ కల్వర్టు పైనుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న మండల కేంద్రానికి చెందినకాసర్ల స్వామి వరద ప్రవాహానికి ఆదివారం రాత్రి కొట్టుకుపోయాడు. కాపాడండీ అంటూ కేకలు వేయడంతో అక్కడే ఉన్న పదిర గ్రామ యువకులు సహాయక చర్యలు చేపట్టారు. యువకుడిని, వాహనాన్ని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేటకు చెందిన స్వామి తన భార్య పిల్లలతో కలిసి బైక్‌పై సిరిసిల్ల మీదుగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లిలో తన అత్తగారింటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రామలక్ష్మణపల్లి, పదిర గ్రామాల మీదుగా స్వగ్రామానికి బయలుదేరాడు. మానేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడం గమనించని స్వామి వాహనంపై దాటే ప్రయత్నం చేశాడు. నీటి ఉధృతికి వాహనంతోపాటు కొట్టుకుపోయాడు. రక్షించండంటూ అరవడంతో యువకులు చేరుకుని కాపాడారు. సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి స్వల్ప గాయాలపాలయ్యాడు. ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్వామిని కాపాడిన పదిర యువకులు రామచంద్రారెడ్డి, చెరుకు సాయి, కుమ్మరి సతీష్, శ్రీకాంత్, ఎలేందర్, అమరేందర్, కంచర్ల సతీష్, సాయిని పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన వేముల మల్లయ్యకుచెందిన మేక ఆదివారం విద్యుదా ఘాతంతో మృతిచెందింది. మల్లయ్య గ్రామశివారులోని బద్దె మారికుంటకు మేకలమందను మేపడానికి తీసుకెళ్లాడు. అందులోని ఒకమేక నోటికి ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మేకవిలువ రూ.10వేలు ఉంటుందని తెలిపాడు.

గ్రానైట్ క్వారీ ప్రమాదంలో కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైమ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన కార్మికుడు సౌరబ్(20) మృతిచెందినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. బండను ట్రాలీలో లోడింగ్ చేస్తుండగా బండ పక్కకు పడడంతో, క్రేన్‌మధ్యలో ఇరుక్కున్న సౌరబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటికార్మికులు సౌరబ్‌ను బయటకు తీసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుత్తు స్తంభంపై నుంచి పడి కార్మికుడి మృతి


గణేష్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ముంజాల గణేష్(20) అనే కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్తు స్తంభంపై నుంచి కిందపడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ముంజాల గణేష్ అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా హన్మకొండలోని ఓ ప్రైవేట్ విద్యుత్తుకాంట్రాక్టు వద్ద పని చేస్తున్నాడు. పనిలో భాగంగా విద్యుత్తుస్తంభం ఎక్కగా జారీ కింద పడగా కిడ్నీలు దెబ్బతిన్నాయి. చికిత్స నిమిత్తం గణేష్‌ను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధ రాత్రి మృతిచెందాడు. గణేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

ఎలిగేడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడులో సుతారి పని చేస్తున్న జంగ్రపల్లి యోహన్(43)అనే తాపీ మేస్త్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం డిపాటిపల్లి గ్రామానికి చెందిన యోహన్ పదేళ్లుగా ఎలిగేడులోని దేవండ్ల శివ అనే వ్యక్తి దగ్గర తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 9న లలితపల్లిలో భవన నిర్మాణంలో భాగంగా మొదటి అంతస్తు పైన నిలబడి ప్లాస్టింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడి కూతురు సంపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు-ద్విచక్రవాహనం ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


శ్రీనివాస్(ఫైల్)

కోరుట్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం వేంకటాపూర్ - మోహన్‌రావుపేట గ్రామాల మధ్య రహదారిపై ఆది వారం కారు-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇల్లెందుల శ్రీనివాస్ (53) అనేవ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన ఇల్లెందుల శ్రీనివాస్, మేడిపల్లికి చెందిన సమీపబంధువు ఇల్లెందుల సాయికృష్ణ ద్విచక్రవాహనంపై మోహన్‌రావుపేట నుంచి వెంకటాపూర్ వైపు వస్తుండగా జగిత్యాలవైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. సంఘటనలో ఇల్లెందుల శ్రీనివాస్ మృతిచెందగా సాయికృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. సాయికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

పిల్లలు పుట్టడం లేదని ఒకరి ఆత్మహత్య


శంకర్(ఫైల్)

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లలో సంతానం కలగడం లేదని మద్యానికి బానిసై శనివారం అర్ధరాత్రి ఉప్పు శంకర్(43) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌కు ఆరు సంవత్సరాల క్రితం వివాహం కాగా సంతానం కలుగలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన శంకర్ శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి

- ధర్మపురిలో విషాదం


జగదీష్ (ఫైల్)

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మపురి పట్టణానికి చెందిన కస్తూరి జగదీష్(35) అనే పిల్లల వైద్యుడు ఆదివారం ఉదయం మృతిచెందాడు. ధర్మపురి పట్టణానికి చెందిన కాంగ్రెస్‌నాయకుడు, జగిత్యాల పంచాయతీసమితి మాజీ కోఆప్షన్ మెంబర్ కస్తూరి రాంకిషన్ పెద్దకుమారుడు జగదీష్ హైదరాబాద్‌లో పిల్లల వైద్యుడిగా సేవలు అందిస్తున్నాడు. ఆదివారం ఉదయం ర్యాపిడో బుక్ చేసుకొని వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బేగంపేట ఫ్లైఓవర్‌వద్ద ర్యాపిడోను వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో ర్యాపిడో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను యశోద ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జగదీష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. డాక్టర్ జగదీష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ధర్మపురికి సాయంత్రం తీసుకువచ్చారు. మృతుడు జగదీష్ నిజామాబాద్ ఎంపీధర్మపురి అర్వింద్‌కు సమీపబంధువు కాగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అడవిశ్రీరాంపూర్‌లో యువకుడి ఆత్మహత్య


ఎడ్ల అజయ్(ఫైల్)

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఎడ్ల అజయ్(25) అనేయువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎడ్ల మల్లయ్య-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా వారిలో పెద్ద కుమారుడు అజయ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. అజయ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈమేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటీర పరిశ్రమలకు ఉచిత కరెంట్ ఇవ్వాలి

- విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం

కోరుట్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటీర పరిశ్రమలు నిర్వహించే విశ్వకర్మలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించాలని విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం అన్నారు. అదివారం కోరుట్ల పట్టణంలోని విశ్వకర్మ సంఘ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం పాల్గొన్నారు. ఈసందర్భంగా విశ్వకర్మ సంఘ నియోజకవర్గ ఇంచార్జుగా వెల్ది శ్రీకాంత్ చారీని ప్రకటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశం మాట్లాడుతూ కమ్మర, వడ్రంగి కులాలకు చెందిన వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం సంస్కరణలు తీసుకరావాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాల చారీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కూనసపల్లి పడాల నరేష్, ఉపాధక్షులు పోన్నగంటి రంజిత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు కొమ్మలు

మానకొండూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్-ఊటూర్ గ్రామాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. రెండు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్లు దూరం ఉంది. 30ఏళ్ల క్రితం రోడ్డుకిరువైపులా ఆర్అండ్‌బీ అధికారులు దురిసెన మొక్కలను నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి వృక్షాలుగా తయారయ్యాయి. ప్రస్తుతం కొన్ని చెట్లు పూర్తిగా ఎండిపోయి కనిపిస్తున్నాయి. ప్రజలు వాటిని తీసుకెళ్లి వంట చెరుకుకు ఉపయోగించుకుంటున్నారు. కొన్ని ఏపుగా పెరిగి ఎండిపోయిన చెట్లు అలాగే ఉండిపోయి రోడ్డు మీద విరిగిపడుతున్నాయి. రెండు గ్రామాల ప్రజలు ఎండిపోయిన చెట్లను తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎండిపోయిన చెట్లను తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. అయితే ఇంతవరకు తొలగించలేదు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

కథలాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తక్కళ్ళపల్లి-బొమ్మెన గ్రామాల మధ్య నాగెల్లి గంగు అనే మహిళ మెడలో నుంచి దొంగలు బంగారు గొలుసు ఎత్తుకెళ్ళారు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాగెలి గంగు అనే మహిళ తన తల్లి గారిల్లు బొమ్మెనలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరై బైక్‌పై తన భర్తతో కలిసి ఇంటికి వెళ్తోంది. తక్కళ్ళపల్లి శివారులో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు ఒక్కసారిగా మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్ళారు. ఈ ఘటనపై పోలీసులు పలు గ్రామాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

హత్యకేసు దర్యాప్తును పారదర్శకంగా జరపాలి



మాట్లాడుతున్న చిరంజీవి కుటుంబ సభ్యులు

వైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో కోట చిరంజీవి హత్యకేసు దర్యాప్తును పోలీస్‌శాఖ నిష్పక్షపాతంగా జరపాలని మృతుడి కుంటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చిరంజీవి కుటుంబీకులు మాట్లాడారు. పోతన కాలనీ మీసేవా నిర్వహిస్తున్న చిరంజీవి భార్య 2019లో మృతిచెందినట్టు తెలిపారు. 2021లో చిరంజీవి ఇంటర్మీడియట్ క్లాస్‌మేట్ అయిన సంధ్యారాణితో పరిచయం అయిందని, అది ప్రేమకు దారితీసినట్టు పేర్కొన్నారు. సంధ్యారాణిని నమ్మిన చిరంజీవి రూ.10లక్షలు, ఐదు తులాల బంగారం, కారు ఇచ్చినట్టు తెలిపారు. తనను పెళ్లి చేసుకోవాలని చిరంజీవిని సంధ్యారాణి వేధించేదని, ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినట్టు తెలిపారు. ఇలా ఉండగా మాట్లాడుకుందామని చెప్పి చిరంజీవిని సెంటినరీకాలనీ ఐకేపీ సెంటర్‌కు రావాలని సంధ్యారాణి బంధువులు పిలవగా చిరంజీవి అక్కడకు వెళ్లాడన్నారు. పక్కా ప్రణాళికా ప్రకారమే ఆమె కుటుంబ సభ్యులు చిరంజీవిని హత్యచేశారని ఆరోపించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి హత్యచేసిన వారికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంతెన రక్షణ గోడను ఢీకొట్టిన లారీ


ధ్వంసం అయిన వంతెన రక్షణగోడ

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ -జగిత్యాల మార్గంలోని నూకపల్లి స్టేజిసమీపంలో గల వరద కాలువ వంతెన రక్షణగోడకు లారీ ఢీకొంది. వంతెన మొదట్లో ప్రమాదకర గుంత ఉండడం, ఎదురుగా వస్తున్న వాహనంను తప్పించే యత్నంలో లారీ వంతెన రక్షణగోడను ఢీకొనడంతో కొంతభాగం కూలిపోయింది. ఇరిగేషన్ సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వంతెన రక్షణ గోడను ఢీకొనడంతో లారీ ముందు భాగం ధ్వంసం అయింది.

ట్రస్మా రాష్ట్ర కన్వీనర్‌గా సొగాని కొమురయ్య



సొగాని కొమురయ్య

కరీంనగర్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర కన్వీనర్‌గా కరీంనగర్ వివేకానంద విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్య నియమితులయ్యారు. కరీంనగర్‌లో జరిగిన ట్రస్మా రాష్ట్రకార్యవర్గ సమావేశానంతరం ట్రస్మారాష్ట్ర కన్వీనర్, కో ఆర్డినేటర్‌తోపాటు కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి, కోశాధికారులను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ మధుసూదన్, ఎన్ రమేశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వివేకానంద విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్యను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, కోశాధికారిగా నగేశ్‌రెడ్డి నియమితులయ్యారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా పోలపల్లి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతి, నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కోశాధికారిగా ఎం.మల్లేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.బాబురావు, ఎ.రాఘవేందర్‌రెడ్డి, ఎం.రాజును నియమించినట్లు ప్రకటించారు.



- పొంతనలేని ప్రకటనలతో గందరగోళం..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనాలు ఉంటాయా..? ఉండవా..? అనే విషయంలో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను చేపడుతోంది. భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలు, కోడెమొక్కులతోపాటు ఆర్జిత సేవలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలు నిలిపి వేస్తారనే ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆలయం మూసివేత ఉండదని, స్వామివారికి ఏకాంత పూజలు, నిత్య కైంకర్యాలు ఎప్పటిలాగే కొనసాగుతాయని మరో ప్రకటన వైరల్ అయ్యింది.

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కామెంట్స్

రాజన్న ఆలయంలో దర్శనాలపై స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న మొక్కులను భక్తులు భీమన్నకు ఎట్లా చెల్లిస్తారని, భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమంటూ హెచ్చరించారు.

- యథావిధిగా దర్శనాలు

రాజన్న ఆలయంలో దర్శనాలపై వైరల్ అయిన ప్రకటలతో భక్తులు ఆందోళన చెందారు. ఆదివారం దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. ప్రస్తుతం దర్శనాలు కొనసాగుతున్నప్పటికి ఎప్పటివరకు కొనసాగుతాయనే దానిపై స్పష్టత లేదు.

ఆలయం ఎదుట ధర్నా, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనాలను నిలిపివేస్తే చూస్తూ ఊరుకోబోమని బీజేపీ నాయకులు మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం రాజన్న ఆలయం ఎదుట ధర్నా చేసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అర్బన్ మండలంలో నందికమాన్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఈవో రమాదేవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాజన్న ఆలయంలో దర్శనాలు కొనసాగుతున్నాయని, దర్శనాలను నిలిపివేయలేదన్నారు. అభివృద్ధిలో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.దీంతో ధర్నాను విరమించారు.



దిష్టి బొమ్మ దహనం చేసి రాజన్న ఆలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

రాజన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులు

- అందరి సూచనలు తీసుకుంటాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రాజన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి. గీతేతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆలయ విస్తరణ సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఇతరుల సూచనలు, సలహాలు ఇదివరకు తీసుకున్నామన్నారు. ఆలయ పిల్లర్ల కోసం లోతుగా గుంతలు తియ్యాల్సి వస్తుందని, పెద్ద యంత్రాలు వస్తాయని తెలిపారు. పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమన్న ఆలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు చేశామన్నారు. 19, 20 తేదీల్లో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి వస్తారని, ఆయన సలహాలు, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి సూచనల మేరకే భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వామివారికి నిత్యం నిర్వహించే కైంకర్యాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయన వెంట రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని కార్మికభవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం కోరుతున్నా కేంద్రప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతివార్డు స్థానం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు సీపీఐ నాయకులు బరిలో ఉండి గెలుపొందడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజరేషన్ బిల్లును అమలు చేయడంతోపాటు రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేములవాడలో ఈనెల26న గుమ్మి పుల్లయ్యభవన్‌లో ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటీ యూసీ జిల్లాకార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జవేణు, కేవీ అనసూర్య, గాజుల రాధ, రవి, అంగూరి రంజిత్, అనవేణి భూదన్న తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఆదివారం 5వేల క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నారు.ఎగువ ప్రాంతం నుంచి 6,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.053టీఎంసీల నీరునిల్వ ఉంది. ఇందులో సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు విడుదల అవుతోంది.

వారసంతల్లో కనీస వసతులు ఎరువు

- కమ్యూనిటీ మరుగుదొడ్ల లేక ఇబ్బందులు



రామడుగులో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారసంత

రామడుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న వారసంతల్లో కనీసవసతులు కరువ వడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రామడుగు మండలకేంద్రంలో కరీంనగర్-గోపాల్‌రావుపేట ప్రధాన రహదారిపై సంత నిర్వహిస్తున్నారు. అలాగే గోపాల్ రావుపేటలో సైతం వ్యవసాయ భూమికి వెళ్లే ప్రధాన రహదారిపై సంతను నిర్వహిస్తున్నారు. అలాగే షానగర్ వద్ద కూడా వారసంత నిర్వహిస్తుండగా ఎక్కడ కూడా కనీస వసతులు లేవని వ్యాపారులు, వినియోగదారులు వాపోతున్నారు. ప్రధానంగా కమ్యూనిటీ మరుగుదొడ్లు లేకపోడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి వారసంతల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని వినియోగదారులు, వ్యాపారులు కోరుతున్నారు.

శబరిమలలో బంగారం చోరీపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శబరిమల శ్రీధర్మశాస్తా దేవాలయంలో బంగారం చరీ, ఆస్తుల దుర్వినియోగంపై ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు నిబంధనల ఉల్లఘనపై తీవ్ర ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ అయ్యప్ప సేవాసమితి సభ్యులు ఆదివారం ఓ కార్యక్ర మానికి భగత్‌నగర్ అయ్యప్ప ఆలయానికి వచ్చిన కేంద్ర మంత్రిని కలిశారు. కఠిన దీక్షతో, నియమాలతో, భక్తితో అయ్యప్ప ఆలయానికి వెళుతా రని, అంతటి విశిష్టత కల ఆలయంలో ఆభర ణాలు చోరీ కావడం, తప్పుడు రికార్డులు నమోదు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. 1999లో ఆలయంలో ఉపయోగించిన 1.5కిలోల బంగారాన్ని రాగిగా రికార్డుచేసి ఉద్దేశ్య పూర్వకంగా దాచిపెట్టారని ఆరోపించారు. బంగారు కవచాన్ని ప్రత్యేక కమిషన్‌కు సమాచారం ఇవ్వ కుండానే ప్రైవేట్ సంస్థకు తరలించి కస్టోడియల్ ప్రొటోకాల్ ఉల్లఘనకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయం వెలుగులోకి రావడం హైకోర్టు ఆదేశాలపై ఏర్పడిన సిట్ విచారణ తర్వాత మాత్రమే జరిగిందని గుర్తుచేశారు. తక్షణమే శబరిమల ఆలయ ఆస్తులపై సీబీఐ పర్యవేక్షణలో ఆడిట్ లేదా సెంట్రల్ హెరిటేజ్ ఆస్తులపై సమీక్ష జరుపాలని డిమాండ్ చేశారు. ఆస్తులను డిజిటల్ పబ్లిక్ ఇన్వెంటరీ సిస్టం ద్వారా నిర్వహిస్తూ కంట్రోలర్ ఆడిట్ జనరల్ నిర్దేశించిన ప్రమాణాలను పాటించేలా చూడాలని తెలిపారు. బాధ్యు లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆల యానికి కేంద్ర సాంస్కృతిక వారసత్వరక్షణ హోదా కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కె పరమేశ్వర్, పి సత్యనా రాయణ, జి నాగరాజు, పి సాయన్న తదత రులున్నారు.



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

23న కొండగట్టులో తలనీలాలకు వేలం

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల నుంచి గత ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు, 2023 ఏప్రిల్ 12 నుంచి జూలై వరకు దేవస్థానం ద్వారా సేకరించి పోగుచేసి నిల్వఉంచిన తలనీలాలకు ఈనెల 23న టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-టెండర్, సీల్డ్ టెండర్‌కం బహిరంగ వేలం నిర్వహంచడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకోసం 8333800721, 8333800723లో సంప్రదించాలని అన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి తరలివచ్చారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు.

రాజన్నసేవలో సీఎం ఓఎస్‌డీ శ్రీనివాస్..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని సీఎం ఓఎస్‌డీ వేములశ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆయనకు స్వస్తివచనంతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఏఈవో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

జాతీయస్థాయి యోగా పోటీల్లో కాంస్య పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మైసూరులో ఈ నెల 9 నుంచి 12వరకు నిర్వహించిన 50వ జాతీయస్థాయి సీనియర్ యోగాసన పోటీలలో జిల్లాకు చెందిన పొన్నపాటి అరుణకుమారి కాంస్య పతకం సాధించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారుపతకం సాధించిన అరుణకుమారి తెలంగాణ రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యోగా సంఘం చైర్మెన్ సర్దార్ రవీందర్‌సింగ్ అరుణకుమారిని అభినందించారు.

జాతీయ పోటీలలో కాంస్యపతకం సాధించిన ఆమె క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. అరుణ కుమారిని రాష్ట్ర యోగా సంఘం ఇంచార్జి ప్రధానకార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్ రెడ్డి, వివిధ జిల్లాల యోగా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.



జాతీయ యోగా పోటీల్లో కాంస్య పతకం, ప్రశంసా పత్రం అందుకుంటున్న అరుణకుమారి

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

- ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. జగిత్యాలజిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలోని శ్రీమఠం స్థలంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మపురి గొప్ప పుణ్య క్షేత్రమని పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో నిత్య నారసింహ హోమం, కుజదోష నివారణ పూజలు నిర్వహించడం వల్ల అనేకమంది దోషాలు తొలగిపోతున్నట్లు ఆయన అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మికత మన జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. రాష్ట్రఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చాగంటి కోటేశ్వర్‌రావు తన ప్రవచనాల ద్వారా ధర్మపురిక్షేత్రాన్ని ప్రపంచానికి తెలియజేశారని అన్నారు. చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలు విని ప్రతిఒక్కరు భక్తిమార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌కుమార్ కొడుకు హరీశ్వర్ కుమార్ రూపొందించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి డాక్యుమెంటరీ ప్రోమోను చాగంటి కోటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం చాగంటి కోటేశ్వర్‌రావు, మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ సత్యప్రసాద్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్‌లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పురాణ ప్రవచకులు బాచంపెల్లి సంతోష్ కుమార్ శర్మ, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సంగన భట్ల దినేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. జగిత్యాల డీఎస్పీ వెంకటరమణ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వైద్యరంగంలో ఏఐది కీలకపాత్ర

- ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సులో వైద్య నిపుణులు



వేదికపై కూర్చున్న సీనియర్ ఫిజీషియన్లు

సుభాష్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ముఖ్యపాత్ర పోషిస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఫిజీషియన్ల 9వ రాష్ట్ర సదస్సు వీ కన్వెన్షన్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖవైద్యులు మాట్లాడారు. రానున్న రోజుల్లో వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ముఖ్యభూమిక పోషిస్తుందన్నారు. డాక్టర్‌కు పేషెంట్‌తో ఎక్కువ సమయం కేటాయించవచ్చన్నారు. జిల్లా కేంద్రానికిచెందిన సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ విఠల్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. రెండు రోజుల పాటు ఆరగనైజింగ్ చైర్మెన్ డాక్టర్ వి తిరుపతి రావు, కార్యదర్శి డాక్టర్ విజయ్ మోహన్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ చైతన్య, డాక్టర్ రఘురామన్, డాక్టర్ సురేష్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో రాష్ట్రసదస్సు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫిజీషియన్ వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● ఊబకాయానికి మందు ఉంది
- డాక్టర్ రాకేశ్ సహాయ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్



కొన్ని సంవత్సరాలుగా మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలి మూలంగా చాలా చిన్న వయస్సులోనే ఊబకాయానికి గురవుతున్నారు. ఊబకాయం వల్ల సుమారు 200రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిని అదుపు చేసేందుకు మందులు అందుబాటులోకి వచ్చాయి.

● రక్తహీనతను తేలికగా తీసుకోవద్దు
- డాక్టర్ గణేష్ జై షట్వార్, హైటెక్ సిటీ యశోద హస్పిటల్



నేడు రక్తహీతన సాధారణమైంది. 10మంది యుక్తవయస్సు ఆడపిల్లల్లో 7నుంచి 8మందికి, 10మంది పురుషుల్లో ఇద్దరి నుంచి ముగ్గురికి, చిన్నపిల్లలు కూడా రక్తహీనతతో బాధపడుతున్నారు. రక్తహీనతను తేలికగా తీసుకోవద్దు. రక్తపరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవాలి.

● మంచి బ్యాక్టీరియాతో రోగం నయం చేయవచ్చు
- డాక్టర్ రవిశంకర్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు



మంచి బ్యాక్టీరియాతో రోగం నయం చేయవచ్చు. ఫీకల్ మైక్రోబయాలజీ టెస్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా ఆరోగ్యవంతంగా ఉన్నవ్యక్తి స్టూల్(మలం)ను తీసుకొని పేషంట్‌కు ట్రాన్స్‌ప్లాం టేషన్ చేయడం వల్ల పేషంట్‌లో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. దాంతో పేషంట్ త్వరగా కోలుకుంటాడు.

రండి బాబూ... రండి..

(5వ పేజీ తరువాయి)

ఆదాయం రూ.961కోట్లు ఉంది. 1డిసెం బరు 2021 నుంచి 30 నవంబరు 2023 వరకు రూ.996కోట్ల ఆదాయం సమకూరింది.

సిండికేట్లపై ఎక్సైజ్ నజర్..

మద్యం టెండర్ల దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై 16 రోజులు గడిచి పోయినా 185 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. రెండో శనివారం అయినప్పటికీ సెలవు లేకుండా దరఖాస్తులు స్వీకరించినా స్పందన కనిపించకపోవడంపై ఎక్సైజ్‌శాఖ సిండికేట్లపై దృష్టిపెట్టినట్లు తెలిసింది. సిండి కేట్ల ద్వారా అప్లికేషన్లు తగ్గి ఆదాయం పడిపోతే రీనోటిపై చేసే ఆలోచనలో ఎక్సైజ్‌శాఖ ఉన్నట్లు తెలుస్తోంది గతంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా ఈసారి రూ.3 లక్షలకు పెంచడంతోనే దరఖాస్తులు తగ్గినట్లుగా చర్చ జరుగుతోంది.

మనోభావాలను దెబ్బతీయవద్దు

ఇల్లంతకుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దని బీజేపీ సీనియర్ నాయకుడు దేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. అనేక సంవత్సరాలుగా పేద భక్తుల దైవం అయిన రాజన్న ఆలయంలో కాకుండా బీమన్న ఆలయంలో భక్తులకు ప్రవేశాలు కల్పించడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే మార్చుకొని ప్రత్యమ్నాయ ఏర్పాట్లను రాజన్న ఆలయంలో చేయాలని కోరారు.

అప్పుడు అప్పగించారు.. ఇప్పుడు తప్పించారు..

- ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో మొండిచేయి.. - ఆందోళనలో గ్రామైక్య మహిళా సంఘాల సభ్యులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో గత యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను ఉన్నతాధికారులు అప్పగించారు. ప్రస్తుత అధికారులు వారిని తప్పించడంతో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని గ్రామైక్య సంఘాల మహిళల్లో అయోమయం నెలకొంది. కేంద్రాల నిర్వహణ బాధ్యత తిరిగి తమకే అప్పగించాలని పేర్కొంటూ ఇటీవల కలెక్టర్, డీఆర్‌డీవోలకు వినతిపత్రాలు అందజేశారు. వీర్నపల్లి మండలం కంచర్లలో గన్నీ సంచుల దిగుమతిని అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు.



వినతి పత్రంతో ఎల్లారెడ్డిపేట గ్రామైక్య సంఘం మహిళలు

గ్రామైక్య సంఘాల నుంచి సహకార సంఘాలకు..

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో గతంలో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండేవి. గత సీజన్‌లో అప్పటి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సహకార సంఘాల నుంచి కేంద్రాలను గ్రామైక్య సంఘాలకు అప్పగించారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని కంచర్ల, అక్కపల్లి, బండలింగంపల్లి, దుమాల తదితర గ్రామాల్లోని కేంద్రాలను స్థానిక గ్రామైక్య సంఘాలు నిర్వహించాయి. వానాకాలంలోనూ కేంద్రాల నిర్వహణకు గ్రామైక్య సంఘాల మహిళలు కొనుగోళ్లు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈక్రమంలో ఉన్నతాధికారులు రెండు మండలాల్లోని 10 కేంద్రాలను మహిళా సంఘాల నుంచి తప్పించి సహకార సంఘాలకు అప్పగించడంతో ఆందోళనలో పడిపోయారు. తాము కేంద్రాల నిర్వహణకు పరికరాలు కొనుగోలు చేశామని ప్రస్తుతం తప్పించడం వల్ల నష్టపోతామని కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీలకు విన్నవించారు. ఫలితం లేకపోవడంతో గ్రామాల్లో గన్నీ సంచుల సరఫరాను అడ్డుకుంటున్నారు.

రూ.80 వేల పరికరాలు కొనుగోలు..

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 10 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు మహిళా సంఘాల ద్వారా సుమారు రూ.80 వేల విలువైన ట్యాబ్, ఇతర పరికరాలను కొనుగోలు చేయించారు. రైతులు, ధాన్యం వివరాలను నమోదు చేసేలా చర్యలు చేపట్టారు. ప్రతి సీజన్‌లోనూ కొనుగోలు చేయాల్సి ఉంటుందంటూ డబ్బులను వెచ్చించేలా చూశారు. ప్రస్తుత వాన కాలంలో ధాన్యం కేంద్రాలకు చేరింది. గ్రామైక్య సంఘాలను తప్పించి సహకార సంఘాలకు అప్పగించడం వల్ల అధికారులు తమకు అన్యాయం చేశారంటూ మహిళలు ఆరోపిస్తున్నారు.

కొనుగోలు కేంద్రం నిర్వహణ బాధ్యత అప్పగించాలి..

- విజయ, మమత గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు, కంచర్ల



మా ఊరిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణను గత సీజన్‌లో అప్పగించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడడంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోళ్లను చేపట్టాం. ప్రతి సీజన్‌లో తామే కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటూ తమతో ట్యాబ్, ఇతర పరికరాలను కొనుగోలు చేయించారు. గత సీజన్‌లో చేపట్టిన మాకు వానాకాలంలో పండించిన ధాన్యం కొనుగోలు చేసే బాధ్యతను తప్పించి ప్యాక్స్‌కు అప్పగించారు. దాంతో మేము నష్టపోతున్నాం. అధికారులు స్పందించి మాకు అప్పగించాలి.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి

ముస్తాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముస్తాబాద్ సహకార సంఘ ఛైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌తో పాటు, చిప్పలపెల్లి, మోర్రాయిపల్లె గ్రామాల్లో ఆదివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లలో అమ్మి మద్దతు ధరను పొందాలన్నారు. దళారుల బారిన పడి మోసపోవద్దని పేర్కొన్నారు. పండించిన ప్రతి గింజను చివరి వరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సింలు, డైరెక్టర్లు పెంజర్ల బాలెల్లు, ప్రతాపరెడ్డి, భాగ్యమ్మ, మహేందర్, సత్యంగౌడ్, కుమార్, అరుట్ల రాజిరెడ్డి, గాంత రాజు, శీల ప్రశాంత్, అంజనేయులు పాల్గొన్నారు.



ముస్తాబాద్‌లో కొనుగోలు కుంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి



తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సబేరాబేగం

● ఎల్లారెడ్డిపేట : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్, అల్మా స్పూర్ సింగిల్ విండో పరిధిలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, దుమాల, అక్కపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ అన్నదాతల ముంగిట్లో మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని అన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు నారాయణ, లక్ష్మణ్, నరహరి, లక్ష్మణ్, గంగవ్వ, సత్తిరెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, లక్ష్మీ, సంఘం కార్యదర్శులు శశివర్ధన్‌గౌడ్, సతీష్, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాజేశం, రవీందర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కోనరావుపేట : దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన పంటను విక్రయించాలని కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన పంటలు దళారులను నమ్మి తక్కువ ధరకు పంటను అమ్మకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ, ఐకేపీ, సహకార సంఘాల కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలన్నారు. దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో త్వరలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు. ప్లే స్టోర్ లో కపాస్ కిషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని స్లాట్ బుక్ చేసుకొని సీసీఐ ద్వారా అమ్మకాలు చేసుకోవాలని కోరారు. మండలంలో రైస్‌మిల్లర్లు కానీ, మధ్య దళారులు కానీ లైసెన్సులు, లైసెన్సు రినివ్ లేకుండా కార్యకలాపాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి మన నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కమిటీ వైస్ ఛైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు..



సిరిసిల్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిపేటలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



వీర్నపల్లిలో ఆందోళన చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో దర్శనాలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఆదివారం సిరిసిల్లలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ పట్టణకమిటీ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి వ్యతిరేకం కాదని కానీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడం అన్యాయమన్నారు. రాజన్న అనేది బీదల దేవుడని ఆయన నిత్యదర్శనాలకు అడ్డంకులు లేకుండా అభివృద్ధిని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు ఊరగోండ రాజు, మోర శ్రీహరి, పల్లికొండ నర్సయ్య, మెర్గు శ్రీనివాస్, రచ్చ రాహుల్, సిద్ది దేవరాజు, కనకయ్య, గాలి శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి పేరిట భక్తులకు రాజన్న దర్శనం నిలిపి వేయడం పట్ల ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు ఆదివారం ఆందోళనకు దిగారు. స్థానిక బస్టాండు ప్రాంతాల్లో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్ధమవడంతో పోలీసులు అడ్డుకున్నారు. సుమారు 100మీటర్ల వరకు అటు పోలీసులు,ఇటు నాయకులు దిష్టిబొమ్మతో పరుగులు తీశారు. అతి కష్టం మీద నాయకులు దహనం చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపిస్తూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. మరో దిష్టిబొమ్మను బైక్‌పై తీసుకు వచ్చి దహనం చేసే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. దహనం చేసిన పోలీసులు అడ్డుకుని లాక్కెళ్లారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి అటు ప్రభుత్వం.. ఇటు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు నాయకులను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. దాంతో నాయకులను బలవంతంగా లాక్కెళ్లారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, రామచంద్రారెడ్డి, లక్‌పతి, నాగరాజు, పీర్యానాయక్, రాజు, తిరుపతి, ప్రకాశ్, రంజిత్‌కుమార్, లక్ష్మారెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆంజనేయులు, సాయి, రవీందర్‌నాయక్, దేవేందర్, కార్తీక్‌రెడ్డి, వేణు, శ్రీశైలం, సంగీత తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్‌తో పాటు మాజీ అధ్యక్షుడు గంట అశోక్, మండల ప్రధాన కార్యదర్శులు మల్లేశ్‌యాదవ్, విగ్నేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పత్తి స్వామిరాజు, సర్వోత్తమ్, దుర్గేష్, స్వామి, చంద్రం, సత్యనారాయణ, అనిల్, ఎల్లం, రాజేష్, ఎలెందర్, దేవరాజు తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : వేములవాడ రాజన్న ఆలయం కోడెమొక్కులకు ఆటంకం కల్గిస్తూ భక్తుల మనోభావాలు ప్రభుత్వం దెబ్బతిస్తుందని నిరసిస్తూ మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై దిష్టిబొమ్మ దహనం చేసి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి స్వంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావ్, బిజెపి నాయకులు కొల అంజనేయులు, ఇటుకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను చందుర్తి మండల శాఖ అధ్యక్షులు మొకిలే విజేందర్ ఆధ్వర్యంలో జిల్లా శాఖ పిలుపు మేరకు ఆదివారం దహనంచేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయం మూసి వేస్తున్నామని పత్రిక ప్రకటన ఇవ్వడాన్ని, కోడెలు కూడా స్థానికంగా ఉన్న భీమేశ్వర ఆలయానికి తరలించడం ఖండిస్తున్నామన్నారు. ఆలయాన్ని మూసివేయకూడదని ఏదో ఒక్క సమయంలో దర్శనం కల్పించాలన్నారు. అభివృద్ధి విషయంలో సహకరిస్తామని, మూసివేస్తే మాత్రం ఊరుకునేది లేదన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ ఆలోచనలు వెంటనే మానుకొని దర్శనాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొంచెట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు, నాయకులు సిర్రం తిరుపతి, చింతకుంట గంగాధర్, చిలుముల హన్మయ్యచారి, ఎంజాల శ్రీనివాస్, లోకోజు సతీష్, గడిగొప్పుల జీవన్, బద్దం తిరుమలరెడ్డి, కొక్కుల నరేష్, మోత్కు పల్లి రాజశేఖర్, చింతకుంట సాగర్, బండెల వెంకటేష్, బోరుకాయ తిరు పతి, మేడిశెట్టి శ్రీహరి, కుసుంబ లింగారావు, సిరికొండ తిరుపతి, పెరుక రంజిత్, ముకేశ్, శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, సంపునూరు దేవయ్య, నీరటి కిషన్, వేణు, భైరగోని వేణు, మల్లేశం, మహేష్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తులకు దర్శనం ఇవ్వకుండా మూసివేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా కాంగ్రెస్ నాయకులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి సహకరిస్తామని అన్నారు. కానీ అభివృద్ధిలో భాగంగా భక్తులకు దర్శనం ఇవ్వకుండా ఆలయాన్ని మూసివేయడం బాగుండదని ఆరోపించారు. ఆలయాన్ని మూసివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీజేపీ నాయకులు గొట్టె రామచంద్రం, భైరగొని సురేష్ గౌడ్, చింతల పరుశురాం, జింక వెంకటి, వేల్పుల తిరుపతి, పొన్నం మహేష్, వెంకటి, శ్రీనివాస్, పరుశురాం, కిట్టస్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఏదునూరి గోపి మాట్లాడారు. వేములవాడలో రాజన్న గుడి పునర్మిణంలో భాగంగా గుడి మూసివేసి భీమేశ్వర ఆలయానికి మళ్లింపు చేసి మొక్కులు అక్కడ చెల్లించ మనడంపై మండిపడ్డారు. రాజరాజేశ్వర స్వామి దర్శనాన్ని భక్తులకు దూరం చేయడంపై మండిపడ్డారు. దర్శనాలు బందు చేస్తే హిందవుల మనోభవాలు దెబ్బతింటాయన్నారు. ఆగమన శాస్త్రం ప్రకారం హిందు దేవాలయాల్లో ఘోరీలు ఉండటం కూడా అపవిత్రమని గుడిలోని దర్గాను తొలగించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కస్తూరి కార్తీక్‌రెడ్డి, కోల కృష్ణ, సినియర్ నాయకులు చిట్నేని శ్రీనివాస్‌రావు, చీకోటి మహేశ్, కామిటికారి పద్మ, విజయ్, నిమ్మల శ్రీనివాస్, దేవానందం తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో ఆందోళన చేస్తున్న నాయకులు



తంగళ్లపల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ బాకీ కార్డుపై ప్రచారం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, హరిదాస్‌నగర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ బాకీ కార్డుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటా తిరుగుతూ బాకీ కార్డును అందించి వివరించారు. ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులను రాబోయే ఎన్నికల్లో నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు రమేశ్, సురేశ్, ప్రకాశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మొదటి బైపాస్ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని దుమాల గ్రామానికి చెందిన వృద్ధుడు రాజనర్సుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజనర్సు బైక్‌పై వెళుతున్న క్రమంలో కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీడీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లాకార్యదర్శి సూరం పద్మ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో తెలంగాణ బీడీ,సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. బీడీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. టేకేదారులు బీడీ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. బీడీ కోతను నిలిపి వేయాలని లేకుండా కంపెనీల ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం బీడీ కార్మికులకు రూ.4వేల పింఛను, ఇందిరమ్మ ఇళ్లు, వైద్య సేవలు అందించాలని పద్మ కోరారు. సమావేశంలో నాయకులు లాస్య, సులోచన, సుజాత, లక్ష్మీ, రేణుక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ కమిటీ చైర్మన్‌గా కొండ యాదగిరిగౌడ్

ముస్తాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని మార్కెట్‌లో శివాలయ కమిటీ ఛైర్మన్‌గా కొండ యాదగిరిగౌడ్‌ను, ఉపాధ్యక్షులుగా అవదూత బాలశేఖర్, బండి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా గందె రామలింగం, కోశాధికారిగా చంద విజయ్‌కుమార్, కార్యదర్శిగా ఉప్పల చంద్రం, సహాయకార్యదర్శిగా పార్వతి రాజు, గందె లక్ష్మయ్యలు ఏకగ్రీవంగా నియామకమయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బత్తుల వెంకటేశ్వర్లు, దండబోయిన శ్రీనివాస్, శెట్టి దేవరాజు, బొంగొని రాజం, శీల తిరుపతి, ఇరుకుల రాజు, పార్వతీ నవీన్, దబ్బెడ దేవేందర్, మ్యాన మల్లేశం ,కోయ రమేశ్, మెంగని రంగరత్నం, అర్వపల్లి సుదర్శన్, మెంగని లింగం, మిట్టపల్లి శ్రీనివాస్, వేముల రాజేశం, తడుక బాలకిషన్‌లు నియామకయ్యారు.

నేడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించనున్నట్లు ఏపీఎం లతామంగేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దలింగాపూర్, ముస్కానిపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నందున రైతులు నాణ్యతాప్రమాణాలు పాటించి ధాన్యాన్ని తీసుకవచ్చి మద్దతు ధరను పొందాలని కోరారు.

క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం

కోనరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కేపీఎల్ క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి గెలుపొందిన ప్రీమియర్ లీగ్ క్రీడాకారులకు నగదు బహుమతులను నిజామాబాద్ గ్రామానికి చెందిన సింగం ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ క్రీడల్లో యువత రాణించాలని అన్నారు. ఇందుకోసం తన వంతు కృషి ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కోనరావుపేట మండల క్రీడాకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి పరామర్శ

రుద్రంగి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు నేరెళ్ల లక్ష్మి జీపీ ట్రాక్టర్ వెనక నుంచి ఢీకొనడంతో కాలికి తీవ్ర గాయాలు కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికురాలు లక్ష్మి గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తుండగా జీపీ ట్రాక్టర్ ఢీకొని ఆమె కాలి మూడు వేళ్లు విరగడంతో పాటు కాలికి గాయాలు అయితే గ్రామ పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని, లక్ష్మీ కోలుకునే వరకు వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మికి తక్షణ సాయం కింద 2వేల రూపాయలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేష్, కంటె రెడ్డి, బోయిని చంద్రయ్య, సింగారపు గంగాధర్, సింగారపు గంగారెడ్డిలతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రి తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలి..



భీమన్న ఆలయంలో పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి జాతర తరువాత రాజన్న ఆలయ అభివృద్ధి పనులను చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేస్తారని వచ్చే ప్రచారాలతో ఆదివారం భీమన్న ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ త్వరలో సమ్మక్క, సారలమ్మ, మహాశివరాత్రి జాతరలు ఉన్నాయని, దీంతో రాజన్న ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు. వచ్చిన తొందర ఏమిలేదని రాజన్న ఆలయంలో జాతర సమయం వరకు దర్శనాలకు భక్తులను అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, గోలి మహేష్, జోగిని శంకర్, రామచంద్రం, నాయకులు నీరటి మల్లేశం, గజ్జల రమేష్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోదాం నిర్మాణానికి భూమి పూజ

కోనరావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సౌకర్యార్థం కోసం కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో మండలంలోని నాగారం గ్రామంలో ఆదివారం గోదాం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ గోదాం పూర్తయితే పశువుల దాన, పాల ఉత్పత్తిదారుల ఆహార దాన, పశువుల మేత, పాల ఉత్పత్తి సామాగ్రి, వస్తువులు సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని నాగారం డెయిరీ ఛైర్మన్ బుర్రవేణి ఎల్లం తెలిపారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.